సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 16 । మే । 2024



ఆహా.. ఆవకాయ
తెలుగు వారి లోగిళ్లు.. పచ్చళ్లకు కూడళ్లు అని చెబుతూ ఉంటారు. ముఖ్యంగా పచ్చళ్లలో రాజు లాంటి ఆవకాయ గురించి ఎవ్వరికీ కొత్తగా పరిచయం చేయనవసరం లేదు.

10లో



కన్నుల పండువగా గ్రామోత్సవం
మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజు బుధవారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0°/27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	38.5	28.0
కాకినాడ	36.5	26.0
అమలాపురం	41.0	27.0

న్యూస్‌రీల్

స్వధార హోమ్ తనిఖీ



బాలికలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

రావులపాలెం: స్థానిక స్వధార హోమ్‌ను సీనియర్ సివిల్ జడ్జి, రాజమహేంద్రవరం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రకాష్ బాబు బుధవారం తనిఖీ చేశారు. హోమ్‌లోని బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే రికార్డులు పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారికి సూచించారు.

జేసీబీ బోల్తా



దుగ్గుదుర్రు వద్ద అంద్రంగి డ్రెయిన్‌లో బోల్తా పడిన జేసీబీ

కాజులూరు: గొల్లపాలెం – కుయ్యేరు రహదారిలోని దుగ్గుదుర్రులో కల అంద్రంగి డ్రెయిన్ వద్ద బుధవారం వంతెనపై నుంచి వెళుతున్న జేసీబీ అకస్మాత్తుగా బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించటంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. కాజులూరు – దుగ్గుదుర్రు మధ్యలో అంద్రంగి డ్రెయిన్‌పై వంతెన కొంతకాలం క్రితం కుప్పకూలింది. నూతన వంతెన నిర్మాణం చేపట్టే పనిలో భాగంగా అధికారులు డ్రెయిన్‌పై మరో తాత్కాలిక వంతెనను నిర్మించారు. ఈ నేపథ్యంలో గొల్లపాలెం నుంచి కుయ్యేరులో మట్టి తీసేందుకు జేసీబీ ఈ తాత్కాలిక వంతెనపై వెళ్లింది. అయితే డ్రెయిన్‌లోకి వాలు ఎక్కువగా ఉండటంతో బోల్తా పడింది. ఆ సమయంలో దానిలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి ఉన్నారు. మరో రెండు జేసీబీలను రప్పించి బోల్తాపడిన దానిని బయటకు తీశారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

అమలాపురం రూరల్: కాట్రేని కోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ బుధవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల మూడంచెల భద్రతలో మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో స్థాయిలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ బలగాలు, మూడో స్థాయిలో సివిల్ పోలీసులు ఉంటారన్నారు. పరిసర ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నత స్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమించామని, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల లోపలకు, పరిసరాలలోకి గుర్తింపు కార్డులు లేనివారు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలకు అనుమతిలేదన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చిన సీసీటీవీ కెమెరాలు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)కు కనెక్ట్ చేశారన్నారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్ అధికారులతో పాటు, పోలీసు అధికారులు 24 గంటలూ డ్యూటీలో ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి జిల్లాలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం : కలెక్టర్



అమలాపురం రూరల్: జిల్లాలో 15,201 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటనలో వివరాలు వెల్లడించారు. పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది, అత్యవసర సేవలో నిమగ్నమైన ఉద్యోగులు ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా ఓటు వేశారన్నారు. హోమ్ ఓటింగ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 2,201 మంది, ముమ్మిడివరంలో 2,026 మంది, అమలాపురంలో 2,513 మంది, రాజోలులో 2,358 మంది, పి.గన్నవరంలో 2,182 మంది, కొత్తపేటలో 2,117 మంది, మండపేటలో 1,804 మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.

సంక్షేమానికే పట్టం!

- విజయవంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ
- బూత్‌ల వారీగా తేలిన ఓటింగ్
- ఫలితాల అంచనాపై ప్రధాన పార్టీల లెక్కలు
- అధికార పార్టీ అభ్యర్థులలో గెలుపు ధీమా

సాక్షి అమలాపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ పూర్తయ్యింది. ఓట్లు వేసిన వారి లెక్క తేలింది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ లెక్క వచ్చింది. దీనితో అభ్యర్థుల గెలుపు ఓటములపై తుది లెక్కలు వేసుకుంటున్నారు. ఓటింగ్ సరళిని బట్టి చూస్తే మరోసారి సంక్షేమ రాజ్యం వస్తోందని రాజకీయ విశ్లేషకుల అంచనా.

జిల్లాలో 15,31,410 మంది ఓటర్లు

అమలాపురం పార్లమెంట్ పరిధిలో 15,31,410 మంది ఓటర్లు ఉండగా 12,84,008 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ భారీగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ శాతం 83.84గా ఉంది. ఇంచుమించు పురుషులతో సమానంగా



తాళ్లరేవులో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు (ఫైల్)

మహిళలు ఓట్లు వేశారు. పార్లమెంట్ పరిధిలో పురుషులు 7,59,104 మంది కాగా, 6,44,189 మంది (84.86 శాతం), 7,72,285 మంది మహిళలకు 6,39,808 మంది (82.84 శాతం) ఓటు వేశారు. వీరితో పాటు పోస్టల్ ఓట్లు కూడా భారీగా పడ్డాయి. జిల్లాలో 15,201 మంది పోస్టల్ ఓట్లు వేశారు. వీరితో పాటు ఇంటి వద్దనే కూడా ఓటింగ్ వేసిన వారి సంఖ్య కూడా అధికంగా ఉంది. గత ఎన్నికలతో సమానంగా జిల్లాలో మరోసారి ఓటింగ్ నమోదైంది. అయితే గతం కన్నా ఈసారి ఓట్లు అధికంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లెక్కలతో బిజీబిజీ

పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతోపాటు బూత్‌ల వారీగా ఓటింగ్ వివరాలు రావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమకు పడే ఓట్లపై లెక్కలు కడుతున్నారు. ప్రాంతాలు, కులాలు, మతాల వారీ ఓటింగ్ వివరాలను పరిశీలిస్తూ తమకు పడే ఓటింగ్‌పై అంచనాకు వస్తున్నారు. కరుడు గట్టిన పార్టీ వాదులు, కప్పదాట్లుకు పాల్పడేవారు.., ఇలా బూత్‌లు వారీగా, తరువాత గ్రామాలు, మండలాలు ఇలా నియోజకవర్గంలో పడిన ఓటింగ్ చూసుకుని మెజార్టీ అంచనా వేసుకుంటున్నారు.



ముక్కామలలో తొలిసారి ఓటు వేసిన యువతులు

వైఎస్సార్ సీపీకి అనుకూలం

పోలింగ్ సరళిని బట్టి అధికార వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఫలితాలు వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓట్లు వేసిన వారిలో వృద్ధులు, మహిళలు, పింఛన్ దారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ ఓటింగ్‌లో మెజార్టీ ఫ్యాన్‌కు ఉంటుందని లెక్కలు కడుతున్నారు. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి మొదలు కాగా ఆరు గంటల నుంచే వృద్ధులు, మహిళలు ఓట్లు వేసేందుకు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. పోలింగ్ ఆలస్యమైనా వారు లెక్కచేయలేదు. రాత్రి 12 గంటల వరకూ పోలింగ్ జరగగా మహిళలు పట్టుదలతో ఓటు వేసిన తరువాతనే తిరిగి వెళ్లారు.

గంటల తరబడి..

పార్లమెంట్ పరిధిలోని కొత్తపేట, నడిపూడి, పేరూరు వంటి ప్రాంతాల్లో ఓటింగ్ ఆలస్యం అయినా మహిళలు, వృద్ధులు గంటల తరబడి నిలబడి ఉండి ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. గ్రామీణ మహిళలతో పాటు పట్టణ మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఓటింగ్ పాల్గొన్నారు. కొంత మంది ఉపాధి కోసం హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉంటూ తమ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున ఓటు వేసి అధికార వైఎస్సార్ సీపీకి దన్నుగా నిలిచారు. ఇవన్నీ తమకు మేలు చేస్తాయని, వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. పార్టీ క్యాడర్ సైతం బూత్‌ల వారీగా పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ తమకు పడే ఓట్లపై ఒక అంచనాకు వస్తున్నారు. మహిళలు, పింఛన్ దారులు వంటి లబ్ధిదారులతో పాటు సంప్రదాయంగా మద్దతు ఇస్తున్న పలు వర్గాల వారు వెన్నుదన్నుగా నిలవడంతో గెలుపు ఖాయమనే విశ్వాసం వైఎస్సార్ సీపీలో కనిపిస్తోంది.

కూటమికి కలిసి రాలేదు

సూపర్ సిక్స్‌తో పాటు దానికి అదనంగా మరో నాలుగు పథకాలు కలిపి మొత్తం పది పథకాలు కలిపి మేనిఫేస్టోలో ప్రకటించినా కూటమిపై ఓటర్లకు నమ్మకం కలగలేదు. దీనికి తోడు టీడీపీ, జనసేన, బీజేపీ అగ్రనేతలు కలిసినా క్షేత్రస్థాయిలో క్యాడర్ కలవలేదు. పరస్పరం అపనమ్మకంతో పని చేయడం వల్ల అది ఓటింగ్‌పై ప్రభావం చూపించింది. జనసేన అసెంబ్లీ అభ్యర్థులు ఉన్న పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలలో టీడీపీ నాయకులు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ చేశారు. ఈ విషయాన్ని జనసేన పార్టీ నాయకులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వీటన్నింటి కన్నా ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు అనుకున్న స్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకత ఓటింగ్‌లో కనిపించలేదని, దీని వల్ల తమ విజయవకాశాలు తగ్గాయని టీడీపీ కీలక నేతలే వాపోతున్నారు.



వక్కలంకలో పోలింగ్ సమయం ముగిసిన తరువాత ఓటర్లకు స్లిప్‌లు అందిస్తున్న పీఓ (ఫైల్)

జోరుగా కొనుగోళ్లు

- 14.95 మిలియన్ల కిలోల వర్జీనియా పొగాకు అమ్మకాలు
- 1.22 లక్షల బేళ్లు విక్రయం
- కిలో గరిష్ఠ ధర రూ.331
- రూ.430 కోట్ల విలువైన పొగాకు అమ్మకం



దేవరపల్లి వేలం కేంద్రంలో కొనుగోలు చేసిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ఊపందుకున్నాయి. వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్ల సంఖ్య రోజురోజుకు పెరగడంతో కొనుగోళ్లు శరవేగంగా జరుగుతున్నాయి. మార్కెట్లో రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో వేలం కేంద్రాలకు రైతులు కోటా ప్రకారం బేళ్లు తీసుకువచ్చి అమ్ముకుంటున్నారు. మార్చి 4వ తేదీన తూర్పు, ఏలూరు జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించగా, ఇప్పటి వరకు 52 రోజులు కొనుగోళ్లు జరిగాయి. ఇప్పటి వరకు రూ.430 కోట్ల విలువ గల 14.95 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి.

నిలకడగా ధర

పొగాకు ధర మార్కెట్లో నిలకడగా ఉంది. 20 రోజులుగా పొగాకు గరిష్ఠ, సగటు ధర నిలకడగా ఉండడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. గురువారం మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.331, సగటు ధర రూ.288, కనిష్ఠ ధర రూ. 225 లభించింది. కిలో గరిష్ఠ ధర రూ.341 పలికిన పొగాకు కొద్దిరోజుల అనంతరం తగ్గుముఖం పట్టింది. రూ.331 ధర నిలకడగా కొనసాగుతోంది. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో వర్జీనియా పొగాకు వేలం కేంద్రాలు ఏర్పాటు చేసి ఇ–ఆక్షన్ విధానంలో పొగాకు కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. 18 కంపెనీలు వేలంలో పాల్గొని పొగాకు కొనుగోలు చేస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని తొర్రేడు, రంగంపేట ప్రాంతాల్లో పండించిన బ్లాక్ సాయిల్(బీఎస్) పొగాకును దేవరపల్లి వేలం కేంద్రంలో విక్రయిస్తున్నారు. ఈ పొగాకు కిలో గరిష్ఠ ధర రూ. 252.62 పలికింది.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- 23 వరకూ ఆన్‌లైన్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- జిల్లాలో 4,413 మంది విద్యార్థులు

రాయవరం: ఏపీ ఈఏపీ సెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అమలాపురం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించనున్నారు. గురువారం, శుక్రవారం అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విద్యార్థులకు, మే 18 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ విద్యార్థులకు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్‌కు 7.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి విద్యార్థులను అనుమతిస్తారు. నిర్దేశిత సమయం కన్నా ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదు. అమలాపురంలో 3,054



మంది ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు, 1,351 మంది అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షకు, ఎనిమిది మంది రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఏపీ ఈఏపీ సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. ఏపీ ఈఏపీ సెట్‌కు పరీక్షల్లో నెగిటివ్ మార్కులు లేవు.

పకడ్బందీ ఏర్పాట్లు



ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం నుంచి ఈ నెల 23 వరకు ఏపీ ఈఏపీ సెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. పరీక్ష నిర్వహణపై జిల్లా ఉన్నతాధికారులతో సంప్రదించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలకు అనుమతి లేదు.

– కె.వెంకటరెడ్డి, ఏపీఈఏపీ సెట్ కన్వీనర్, కాకినాడ

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- పెరిగిన పోలింగ్ శాతమే నిదర్శనం
- ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ తిరుగులేని విజయం సాధించబోతోందని రాజోలు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ధీమా వ్యక్తం చేశారు. మామిడికుదురులోని పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య ఇంటిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండోసారి సీఎంగా అవకాశం కల్పిస్తూ ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పారన్నారు. వలంటీర్ వ్యవస్థతో పాటు గ్రామ సచివాలయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ విజయానికి బాసటగా నిలిచాయన్నారు. రాజోలు నియోజకవర్గంలోనూ విజయ కేతనం ఎగురవేస్తామన్నారు. భారీగా పెరిగిన పోలింగ్ శాతం వైఎస్సార్ సీపీ విజయానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. పార్టీ విజయం కోసం వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఎంతగానో శ్రమించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కూటమి నాయకులు ఎంత కవ్వించినా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనంతో వ్యవహరించి, శాంతియుతంగా పోలింగ్ జరిగేందుకు సహకరించారన్నారు. సమావేశంలో నయినాల రామకృష్ణ, సూరిశెట్టి బాబీ, కంచి శ్రీరామ్, వర్ధినేని రాము, బందారు కాశీ, సర్కిల్ ముస్తఫా, నయినాల కన్న, గెడ్డం రాంబాబు, పినిశెట్టి నాగబాబు, కొల్లాబత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

ఐటీఐ... అవకాశాలు హాయ్!

- పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాలకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల
- ఈ ఏడాది ప్రారంభం కానున్న డ్రోన్ టెక్నాలజీ స్వల్పకాలిక కోర్సు
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు జూన్ 10 తుది గడువు
- కోనసీమ జిల్లాలో 2,564 సీట్లు

రాయవరం: పదవ తరగతి పరీక్షలు పూర్తయి ఫలితాలు కూడా వచ్చాయి. ఇప్పుడు విద్యార్థులు పది అనంతర కోర్సులపై దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు పూర్తయ్యాయి. పలువురు విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏ కోర్సులో చేరాలా అని ఆలోచన చేస్తున్నారు. అధిక శాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరగా, పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసినవారు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఒక చక్కటి అవకాశంగా భావించవచ్చు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

18 ఏళ్లు దాటగానే..

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కని మార్గంగా ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. అయితే ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. ఇదిలా ఉంటే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు దోహదపడుతుంది.



టెక్నికల్ కోర్సులు అభ్యసిస్తున్న ఐటీఐ విద్యార్థులు (ఫైల్)



కాకినాడ ప్రభుత్వ ఐటీఐ

జిల్లాలో పరిస్థితి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు లేవు. కాకినాడ జిల్లాలో మాత్రమే రెండు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో 15 ఐటీఐలు ప్రైవేట్ యాజమాన్యంలో ఉండగా, వీటిలో ఏడాది, రెండేళ్ల కాలపరిమితితో 2,564 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 12 ప్రైవేట్ యాజమాన్యంలో 1,704 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 708 సీట్లు ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు 4,976 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అనంతరం బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోవడానికి కూడా ఒక చక్కని అవకాశంగా దోహదపడుతుంది. ఈ విధంగా ఏటా పలువురు విద్యార్థులు నేరుగా లేటరల్ ఎంట్రీని పొంది, ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత ఉద్యోగావకాశాలను పొందుతున్నారు.

రెండేళ్ల కాలపరిమితి కోర్సులు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఆర్‌అండ్ ఏసీ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, టర్నర్, మెచినిస్ట్.
ఏడాది కాలపరిమితి కోర్సులు
మెకానిక్ డీజిల్, సీవోపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో


ఏడాది, రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు

ఐటీల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌సమేన్ సివిల్, ఇన్స్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏ ఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేస్తారు. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 10వ తేదీ తుది గడువుగా ఉపాధి, శిక్షణ శాఖ ప్రకటించింది.

డ్రోన్ టెక్నాలజీపై స్వల్ప కాలిక కోర్సు ప్రారంభం

ఈ ఏడాది కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశ పెట్టారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్‌లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కోర్సును ఈ ఏడాది ప్రారంభించే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరగోరే విద్యార్థులు జూన్ 10వ తేదీ 11.59 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరు కావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదవ తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

– ఎంవీజీ వర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, కాకినాడ

క్లుప్తంగా

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

దేవరపల్లి: విశాఖ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ అమరావతి బస్సు గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టింది. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుంచి బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

పాల ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి



అజ్జరపు రాజారావు (ఫైల్)

రావులపాలెం: జాతీయ రహదారిపై ఈతకోట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన అజ్జరపు రాజారావు (60) స్థానికంగా ఉన్న ఒక ప్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ప్యాక్టరీకి సమీపంలో రోడ్డు పక్కన సైకిల్‌తో నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో రావులపాలెం వైపు వస్తున్న పాల ట్యాంకర్ అదుపు తప్పి అతడిని ఢీకొంది. లారీ వెనుక చక్రాలు తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ వైకుంఠరావు తెలిపారు.

19న చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర చెస్, జిల్లా చదరంగం అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పిడింగొయ్యిలోని ఫ్యూచర్‌కిడ్స్ గ్లోబల్ స్కూల్లో ఈ నెల 19వ తేదీన రాష్ట్రస్థాయి ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా చదరంగం అసోషియేషన్ సెక్రటరీ జీవీ కుమార్ బుధవారం తెలిపారు. పోటీలో గెలుపొందిన మొదటి 25 మంది విజేతలకు రూ.లక్ష నగదును విభజించి అందజేస్తామన్నారు. ఆసక్తి కల క్రీడాకారులు తమ పేర్లను శుక్రవారంలోపు ఏపీచెస్‌ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 62812 50967 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆహా.. ఆవకాయ

- పచ్చడి తయారీలో మహిళల నిమగ్నం
- మార్కెట్‌లో మామిడికాయలకు డిమాండ్
- పెరిగిన ఇతర వస్తువుల ధరలు



మార్కెట్‌లో మామిడికాయలు కొనుగోలు చేస్తున్న జనం

అలరాయవరం: తెలుగు వారి లోగిళ్లు.. పచ్చళ్లకు కూడళ్లు అని చెబుతూ ఉంటారు. ముఖ్యంగా పచ్చళ్లలో రాజు లాంటి ఆవకాయ గురించి ఎవ్వరికీ కొత్తగా పరిచయం చేయనవసరం లేదు. ఇంటింటా సుపరిచితమైన ఆవకాయపై ముఖ్యంగా తెలుగు వారికి పేటెంట్ ఉందని చెప్పవచ్చు. దీనిని పేదల నుంచి ధనికుల వరకూ ప్రతి ఒక్కరూ లొట్టలేసుకుని తింటారు.

సీజన్ వచ్చేసింది


వేసవి వచ్చిందంటేనే పచ్చళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. ఉగాది పచ్చడిలో మామిడికాయ ముక్కలను వేస్తారు. అప్పటి నుంచే మామిడికాయలు తినడం ప్రారంభమవుతుంది. మామిడికాయలు పెరిగి పెద్దవై, పీచు కట్టిన తర్వాత పచ్చడి కాయలను కోసి అమ్మకాలు చేస్తారు. మామిడికాయ పచ్చడిని రకరకాలుగా పెట్టుకోవడం అనాదిగా ఆనవాయితీగా వస్తోంది. ఆవకాయ, మాగాయ, బెల్లం ఆవకాయ, అల్లం ఆవ, మెంతి ఆవ ఇలా రకరకాలు ఉన్నాయి. వ్యవసాయ కుటుంబాల్లో సీజన్ వచ్చిందంటే చాలు పెద్ద జాడీల నిండా పచ్చళ్లను సిద్ధం చేసుకుంటారు. ప్రతి రోజూ అన్నంలో కూరలతో పాటు పచ్చడిని కలుపుకొని తింటారు. అలాగే కూలీలు, ఇతర పనులకు వెళ్లే వారి క్యారియర్‌లో ఆవకాయ పచ్చడి తప్పనిసరిగా ఉంటుంది.

కత్తెర సీజన్ ప్రారంభానికి ముందే..

ప్రస్తుత సీజన్‌లో ప్రతి కుటుంబం తమ శక్తికి తగ్గట్టు ఆవకాయ, మాగాయ పచ్చళ్లు తప్పనిసరిగా తయారు చేసుకుంటారు. సాధారణంగా కత్తెర సీజన్ ప్రారంభం కాకముందే వీటిని పూర్తి చేస్తారు. దేశవాళీ, సూదలు, రసాలు, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, హైదర్ సాహెబ్ తదితర రకాల మామిడి కాయలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. సాధారణ రకాల 100 కాయలు రూ.2,000 నుంచి 2,500 వరకూ, నాణ్యమైన రకాలైన హైదర్ సాహెబ్, కొత్తపల్లి కొబ్బరి వంటివి 100 కాయలను రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ విక్రయిస్తున్నారు. పచ్చడి పట్టే మామిడి కాయలను ముక్కలుగా కొడుతూ కొందరు ఉపాధి పొందుతున్నారు. ఇందుకోసం ఒక్కో మామిడికాయకు రూ.2 చొప్పున తీసుకుంటున్నారు.

పచ్చళ్లకు ధరాఘాతం

మామిడికాయలతో పాటు పచ్చడి పట్టడానికి వినియోగించే గానుగ నూనె, ఎండుమిర్చి, ఆవాలు, మెంతులు, వెల్లుల్లి ధరలు బాగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పచ్చడి పెట్టడం భారంగా మారుతుంది. కుంచుడు ముక్కలతో పచ్చడి పెట్టాలంటే దాదాపుగా రూ.2 వేలు ఖర్చవుతుంది. పెరిగిన ధరల కారణంగా పచ్చళ్లను పట్టుకునే పరిస్థితి లేదని పలువురు సాధారణ, మధ్య తరగతి వారు వాపోతున్నారు. అయినా పెరిగిన ధరలను తట్టుకోలేక తక్కువ పరిమాణంలో పట్టుకుంటున్నారు.



ఆవకాయ పచ్చడి

మరికొన్ని కారణాలు

గతంతో పోలిస్తే పచ్చళ్లు పట్టుకునే వారి సంఖ్య ఏడాదికేడాది తగ్గుతోంది. ప్రజల్లో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు, ముడి సరుకుల ధరలు పెరగడంతో పాటుగా అంగట్లో పలు రకాల రెడీమేడ్ పచ్చళ్లు దొరకడం దీనికి కారణమని చెప్పవచ్చు. వయసుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ వంటి వ్యాధులు రావడంతో వైద్యుల సలహా మేరకు పచ్చడి తినడాన్ని చాలా మంది తగ్గిస్తున్నారు. పచ్చళ్ల తయారీ కేంద్రాల నుంచి నేరుగా మార్కెట్లోకి అందుబాటులోనికి వస్తున్నాయి. దీంతో అవసరమైన సమయంలో తమకు కావాల్సిన పచ్చడిని ఒక్కో ప్యాకెట్/బాటిల్ పచ్చడిని కొనుగోలు చేసుకుంటున్నారు.



మామిడికాయలను ముక్కలుగా కోస్తున్న దృశ్యం

కన్నుల పండువగా వీరేశ్వరుని గ్రామోత్సవం



ప్రత్యేక రథంపై దర్శనమిచ్చిన వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజు బుధవారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు బుధవారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. శైవాగమ పద్ధతిలో రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు, అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలోని వృద్ధ గౌతమీ తీరంలో స్వామివారికి త్రిశూల స్నానం వైభవంగా జరిపారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ బహుకరించిన రథంపై సాయంత్రం స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. కాగా.. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తుల కోసం ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం



ఏపీఆర్‌జేసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన రామమోహన్

మామిడికుదురు: సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని మామిడికుదురు గ్రామానికి చెందిన లిఖిత పూడి హరిసత్య రామమోహన్ అన్నాడు. ఈ విద్యార్థి ఏపీఆర్‌జేసీ ఫలితాలలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. మంగళవారం రాత్రి ఈ ఫలితాలు విడుదల అయ్యాయి. రామమోహన్ ఎంఈసీ విభాగంలో 150 మార్కులకు 140 సాధించాడని తండ్రి, పీఈటీ రమేష్ బుధవారం తెలిపారు. తల్లి సునీత ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ ఇంటర్‌లో ఎంపీసీ చదువుతానని, అనంతరం ఐఐటీ ద్వారా సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళతానన్నాడు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రామమోహన్ 600 మార్కులకు 585 సాధించాడు.

పది కాసుల బంగారం చోరీ

నిడదవోలు: పట్టణ శివారు బసివిరెడ్డిపేటలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఇంటి యజమానికి సమాచారమిచ్చారు. వివరాల్లోకి వెళితే.. బసివిరెడ్డిపేటకు చెందిన కవితరపు మోహనరావు తన కుటుంబ సభ్యులతో మంగళవారం ఊటీ వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన దుండగులు ఆ ఇంటి ప్రధాన ద్వారం గడియను ఇనుప రాడ్డుతో పెకిలించి తాళం తీసేశారు. బెడ్‌రూమ్‌లోని బీరువాను బద్దలుగొట్టి మూడు కాసుల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు అపహరించుకుపోయారు. కాగా.. ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని ఇరుగుపొరుగు వారు గమనించి, యజమాని మోహనరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఊటీ నుంచి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగిన విషయం నిర్ధారణ అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం



ధవళేశ్వరంలో కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



దుళ్లలో కాటన్ జయంతిలో పాల్గొన్న గ్రామస్తులు

- డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు
- ఘనంగా అపర భగీరథుడి జయంత్యుత్సవం

ధవళేశ్వరం: ఆనకట్ట నిర్మాణం ద్వారా ఉభయ గోదావరి జిల్లాలను ధాన్యాగారంగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. కాటన్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ కాటన్ దొర ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మాణం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించారన్నారు. డెల్టా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరంగం బాలరాజు, మోర్త పావనమూర్తి, గునిపే అశోక్, ఒంటెద్దు కృష్ణ, మిరప రమేష్, ముత్యాల జాన్, నంబూరి రవి, గూటం రాజు, పందెళ్ల భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో...

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో బ్యారేజ్ సెంటర్‌లో కాటన్ జయంతి ఘనంగా నిర్వహించారు. గోదావరి డెల్టా సిస్టమ్ సీఈ ఆర్.సతీష్ కుమార్, ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, డీఈ యు.రమేష్, ఏఈ అద్దంకి సాయిరామ్ పాల్గొన్నారు.

కాటన్ విగ్రహానికి ధాన్యాభిషేకం

కడియం: దుళ్ల గ్రామానికి చెందిన ఆదర్శ రైతు అవార్డు గ్రహీత సత్తి భాస్కరరెడ్డి (కందరెడ్డి) బుధవారం కాటన్ విగ్రహానికి ధాన్యాభిషేకం చేశారు. తన ఇంటి ముందు ప్రతిష్ఠించిన కాటన్ విగ్రహానికి గ్రామస్తులు, స్థానిక రైతులతో కలిసి నివాళులర్పించారు. వేదమంత్రోచ్చారణల మధ్య ధాన్యం, నదీ జలాలతో అభిషేకించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు దూడల నాగేశ్వరరావు, చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం

పిఠాపురం: పట్టణంలో గురువారం నుంచి బాస్కెట్‌బాల్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. బాల బాలికలకు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు.

జట్టు కూలీల మృతదేహాలకు పోస్టుమార్టం



డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

పి.గన్నవరం: రాజవరం – పొదలాడ రోడ్డులో ఊడిమూడి గ్రామం వద్ద మంగళవారం రాత్రి ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో చనిపోయిన నలుగురు జట్టు కూలీల మృతదేహాలకు బుధవారం కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు లోడు చేసి, పగ్గం కడుతుండగా వెనుకనుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు కూలీలు గాయపడ్డాడు. జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ (35), వాసంశెట్టి సూర్యనారాయణ (45), ఈరి కట్లయ్య (50, ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు (30) మృత దేహాలకు కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం ఎస్సైలు బి.శివకృష్ణ, చిరంజీవి, రాజేష్, సురేష్‌లు శవ పంచనామా చేసి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. వారిని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు భోరున విలపించారు. జి.పెదపూడి, ఆదిమూలం వారిపాలెం గ్రామాల్లో విషాద ఛాయలు అలము కున్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిలకలపూడి సురేష్, జి.పెదపూడికి చెందిన మట్టా శ్రీనివాస్, బొరుసు వేణుగోపాల్, నానీలు అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేయగా, సీఐ ప్రశాంత కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలను పలువురు పరామర్శించారు.

ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

అమలాపురం రూరల్: నలుగురు జట్టు కూలీలు కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె. సత్తి బాబు, సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి నూకల బలరాం కోరారు. ఈ మేరకు బుధవారం డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి, కిమ్స్ హస్పిటల్లో వైద్యం పొందుతున్న బాధితులను పరామర్శించారు. చిలకలపూడి నాని, బొరుసు నాని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదానికి ఆర్టీసీ యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కాలం చెల్లిన బస్సులను నేటికీ ఆర్టీసీ నడుపుతోందని విమర్శించారు. గన్నవరం నుంచి రావులపాలెం వెళ్లే రోడ్డు నిర్మాణంలో కూడా లోపాలు ఉన్నాయన్నారు. రాత్రిపూట ప్రయాణం చేసే ప్రయాణికులకు రేడియేషన్స్ బిట్స్ (చీకటిలో కనబడే ఇండికేటర్లు) సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైస్ ఎంపీపీ ఇంటిపై దాడికి యత్నం

- మద్యం తాగి టీడీపీ కార్యకర్తల వీరంగం
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం




జగన్నాథపురంలో పోలీసులతో మాట్లాడుతున్న ఏలూరు డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్

గోపాలపురం: వైఎస్సార్ సీపీకి చెందిన వైస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ ఇంటిపై మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు దాడికి యత్నించారు. రాత్రి సుమారు 11 గంట సమయంలో జగన్నాథపురంలోని నారాయణమ్మ ఇంటి వద్దకు టీడీపీకి చెందిన సుమారు 20 మంది కార్యకర్తలు మద్యం తాగి వచ్చారు. ఆమెను దుర్భాషలాడుతూ కులం పేరుతో తిడుతూ బీభత్సం సృష్టించారు. వెంటనే నారాయణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి టీడీపీ అల్లరి మూకలను చెదరగొట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఐజీ, ఏలూరు ఇన్‌చార్జి డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ జి.జగదీష్ జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్‌ను పరిశీలించారు. అనంతరం డీఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే వరకూ సమస్యాత్మక గ్రామాలలో పోలీసు పికెటింగ్ కొనసాగుతుందన్నారు. ఆయన వెంట కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, దేవరపల్లి సీఐ కె.బాలసురేష్, ఎస్సై కర్రి సతీష్ కుమార్ ఉన్నారు.

ఏలేరులో అడుగంటిన నీటి నిల్వలు



ప్రాజెక్టు గేట్ల వద్ద దుస్థితి



విశాఖకు మోటార్ల ద్వారా తరలిస్తున్న నీరు

- ఆందోళనలో రైతాంగం
- ఖరీఫ్‌పై అనుమానాలు

ఏలేశ్వరం: వేసవి ధాటికి ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు క్రమేపీ అడుగంటుతున్నాయి. దీంతో దిగువ ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున రోజు రోజుకూ నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 68.95 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.81 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఈ ప్రాజెక్టు కింద ఉన్న సుమారు 54 వేల ఎకరాలకు రాబోయే రోజుల్లో సాగు నీరందని పరిస్థితి నెలకొనే అవకాశాలున్నాయి. దీంతో పాటు దిగువ ఏలేరు కాలువలో నీటి సరాఫరా నిలిపివేయడంతో పశువులు నీటి కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే పశువులతో పాటు, సమీప గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ప్రాజెక్టుపై ఆధారపడి నిర్మించిన ఫిల్టర్ బెడ్ ద్వారా పలు గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. నీటి నిల్వలు తగ్గితే ఫిల్టర్ బెడ్ ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు గణనీయంగా పడిపోయినా, విశాఖపట్నానికి నీటిని తరలించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టులో నీటిని మోటార్ల సాయంతో పది పైపుల ద్వారా విశాఖపట్నానికి 140 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

ఖరీఫ్‌పై అనుమానాలు

ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడంతో పాటు, వరి సాగు పూర్తి కావడంతో ఏలేరు కాలువకు నీటి సరాఫరా నిలిపివేశారు. ప్రస్తుత నీటి నిల్వల నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఖరీఫ్ సాగుపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిని బట్టే ఆయకట్టులో సాగు ఆధారపడి ఉంటుంది. అలాంటిది నీటి నిల్వల తగ్గుదలతో రైతులు నిరాశ చెందుతున్నారు. వరుణుడు కరుణించి దయ చూపాలని రైతులు కోరుకుంటున్నారు.

17, 18 తేదీల్లో గైట్‌లో ఎస్టీయూ రాష్ట్ర స్థాయి శిక్షణ

రాజానగరం: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణ తరగతులను ఈనెల 17, 18 తేదీలలో గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆ కళాశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది సభ్యులు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆల్కాట్ గార్డెన్స్ సమీపంలోని వెల్లంకి వారి వీధి ఎదురుగా ఉన్న రోడ్డుపై బుధవారం వ్యక్తి మృతదేహాన్ని (సుమారు 45 ఏళ్లు) స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు, రేపు గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీ

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులకు మొదటి జాబితా సీట్లను ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా కేటాయించామని జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు తెలిపారు. మిగిలిన సీట్లను ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులతో మెరిట్ లిస్ట్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ద్రాక్షారామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం బాలురకు, కాకినాడ సాంబమూర్తి నగర్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం బాలికలకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందన్నారు. ఆయా విద్యార్థుల మొబైల్ నంబర్లకు ఇప్పటికే సమాచారం అందజేసినట్టు తెలిపారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. ఇతర సమాచారం కోసం జి.దేవి 63040,97747, వి.ప్రసాద్‌బాబు 94404 99016 నంబర్లను సంప్రదించాలన్నారు.